క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి రూ.3 లక్షల విరాళం



ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందిస్తున్న ఓం శాంతి విజయ

రోలుగుంట: వెలంకాయల పాలెం సమీపంలో తలపెట్టిన ఐశ్వర్యాంబిక సహిత అనంతేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి రోలుగుంటకు చెందిన భక్తులు కొట్టే గంగరాజు, ఓంశాంతి విజయ దంపతులు రూ.3 లక్షలు విరాళాన్ని నగదు రూపంలో కమిటీ సభ్యులకు శుక్రవారం అందజేశారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

సంతోషిమాతకు ప్రత్యేక కుంకుమ పూజలు



మాడుగుల రూరల్: కె.జె.పురం జంక్షన్‌లోని సంతోషిమాత ఆలయంలో శుక్రవారం ప్రత్యేక కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. రెండో శ్రావణ శుక్రవారం సందర్భంగా అమ్మవారిని స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి దర్శించుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కాళ్ల అమ్మతల్లినాయుడు పర్యవేక్షణలో భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. శనివారం ఆలయం వద్ద అమ్మవారి మాల ధారణ జరుగుతుందని అమ్మతల్లినాయుడు తెలిపారు.

దుర్గాలమ్మకు నగల బహూకరణ



అమ్మవారికి వెండి తాడు, శతమానం అందిస్తున్న భక్తులు

మాడుగుల రూరల్: కె.జె.పురం గ్రామంలోని దుర్గాలమ్మకు 15 తులాల వెండి తాడు, శతమానంను శుక్రవారం విశాఖకు చెందిన కోరుబిల్లి కొండ వెంకట్రావు, లక్ష్మి, కోరుబిల్లి హరికృష్ణ ప్రసాదు, సుధారాణి బహూకరించారు. అంతకు ముందు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పోలమరశెట్టి చిట్టినాయుడు, లక్ష్మి దంపతులు, స్థానికులు పుట్టా వెంకట రామప్పారావు, పి.కిశోర్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం



హెచ్‌ఎం బంగారయ్యను సన్మానిస్తున్న సర్పంచ్, తదితరులు

మాడుగుల రూరల్: కింతలి ఎంపీపీ పాఠశాలలో పని చేస్తూ ఇటీవల జి.అగ్రహారం ఎంపీపీ పాఠశాలకు బదిలీ అయిన ప్రధానోపాధ్యాయుడు కె.బంగారయ్యను శుక్రవారం సన్మానించారు. కింతలి పాఠశాలలో సర్పంచ్ మైచర్ల భవానీ, ఎంపీటీసీ సభ్యుడు మైచర్ల సన్యాసిరావు, పాఠశాల కమిటీ చైర్మన్, సభ్యులు ఆధ్వర్యంలో బంగారయ్యను సన్మానించి, ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఇదే పాఠశాలలో పని చేస్తూ బదిలీ అయిన రాపేట లావణ్య, శివాజీలను కూడా ఘనంగా సన్మానించారు.

డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన



డ్రైనేజీ పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ సర్వేశ్వరరావు

మాకవరపాలెం: మండల కేంద్రంలోని బీసీ కాలనీలో ఉన్న అడవిరాజులబాబు ఆలయానికి వెళ్లే రోడ్డులో డ్రైనేజీ నిర్మాణానికి శుక్రవారం ఎంపీపీ రుత్తల సర్వేశ్వరరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ డ్రైనేజీ నిర్మాణానికి రూ.5 లక్షల మండల పరిషత్ నిధులు మంజూరు చేసినట్టు చెప్పారు.

అంతటా కరువుఛాయలు.!

• వర్షాభావ పరిస్థితులతో రైతుల ఆందోళన • నారుమడుల సంరక్షణకు నానా పాట్లు



ఎండిపోయిన సాగరం కన్నులు చెరువు

మాడుగుల : ఈ ఏడాది ఖరీఫ్ కష్టకాలంగా మారుతుంది. అడపాదడపా చినుకులు తప్ప పెద్ద వర్షాలేమి లేవు. దీంతో పంట చెరువులు సాగునీరు లేక ఎండిపోతున్నాయి. గత ఏడాది ఇదే సమయానికి చెరువుల్లో పుష్కలంగా నీరు చేరడంతో వరి నాట్లు వేసుకున్నారు. ఈఏడాది చెరువులు నిండుతాయని ఆయకట్టు భూముల్లో రైతులు వరి నారులు వేసుకున్నారు. తీరా జూలై దాటిపోతున్నా సరే వరుణుడు కరుణించకపోవడంతో ప్రస్తుతం వరి నారులు సైతం ఎండిపోతున్నాయి. మండలంలో సాగరం, ఎం.కోడూరు, శంకరం, తాటిపర్తి, ఎం.కె.వల్లాపురం, ఎం.కోటపాడు, అవురువాడ, వీరవల్లి అగ్రహారం గ్రామాల్లో చెరువులు ఎండిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది మండలంలో 11,500 ఎకరాలు ఖరీఫ్ సాగు చేయడానికి రైతులు వరి నారుమడులు సిద్ధం చేసుకున్నారు. అయితే ఈ ఏడాది మండలంలో కరువుఛాయలు కనిపిస్తున్నాయని, ప్రభుత్వమే ఆదుకోవాలని పలు గ్రామాల రైతులు కోరుతున్నారు.

బుచ్చెయ్యపేట మండలంలో..

బుచ్చెయ్యపేట : మండలంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. వేసవిని తలపిస్తున్న రీతిలో ఎండలు మండిపోతున్నాయి. వర్షాకాలమైన ఆగస్టు నెల వచ్చిన అనుకూలమైన వర్షాలు కురవలేదు. ప్రస్తుతం కాస్తున్న ఎండకి, వేడి గాలులకు బుచ్చెయ్యపేట మండలంలో పలు గ్రామాల్లో ఆకుమడులు ఎండిపోతున్నాయి. రైతులు నాటిన సరుగుడు, యూకలిప్టస్, చెరకు నాట్లుతో పాటు పలు రకాల కూరగాయలు, పప్పుదినుసు పంటలు ఎండకి వడలిపోతున్నాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు దాటినా నేటికి వర్షాలు లేని కారణంగా బుచ్చెయ్యపేట, దిబ్బిడి, రాజాం, తురకలపూడి, సీతయ్యపేట, గున్నెంపూడి, లోపూడి, శింగవరం, బంగారుమెట్ట, ఎల్‌బీ పురం, కేపీ అగ్రహారం, పెదమదీన తదితర గ్రామాల్లో వరినాట్లు ప్రారంభం కాలేదు. ఎర్రవాయి ప్రాంతంగా గుర్తుంపు పొందిన బుచ్చెయ్యపేట మండలంలో సరైన సాగునీటి సదుపాయాలు లేక 50 గ్రామాలకు గాను 45 గ్రామాలు వర్షాధార మీదనే ఆధారపడి పంటలు సాగుచేస్తున్నారు. మండలంలో ప్రతి ఏటా 5,800 ఎకరాలకుపైగా విస్తీర్ణంలో వరి నాట్లు వేస్తారు. గతంలో ఇదే సమయానికి 2,500 ఎకరాలకుపైగా విస్తీర్ణంలో వరినాట్లు వేయగా ఈ ఏడాది 90 ఎకరాల్లో కూడా వరినాట్లు పడలేదు. సరుగుడు, యూకలిప్టస్ మొక్కలు, ఆకుమడులను డీజిల్ ఇంజిన్, మోటార్లతో నీరు తోడి రైతులు రక్షించుకుంటున్నారు. రెండు, మూడు రోజుల్లో వర్షాలు కురవక పోతే ఆకుమడులు పూర్తిగా ఎండిపోయేలా ఉన్నాయి.



బంగారుమెట్ట, ఎల్‌బీ పురం పొలాల్లో నారుమడిని చూసి చలించిపోతున్న మహిళా రైతు

నారుమడి సంరక్షణలో..



రోలుగుంటలో నారుమడి తడుపుతున్న మహిళా రైతు

రోలుగుంట : మండల రైతులు నారుమడులు సంరక్షణ పనుల్లో నిమగ్నమయ్యారు. వర్షాలు లేక నారుమడులు ఎండిపోతున్నాయి. దీంతో మోటార్లు ఉన్న వారు బావుల సమీప చెరువుల నుంచి నీటిని సేకరించి తడుపుకొంటున్నారు. మోటార్లు లేని వారు సొంతంగానే బావుల నుంచి, బోర్ల నుంచి నీటిని సేకరించి ఆకుమడులు తడిపి సంరక్షించుకుంటున్నారు.



లూలూరులో ఎండిపోతున్న యూకలిప్టస్ మొక్కలకు ఇంజిన్‌తో నీరు పెడుతున్న రైతులు

బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని ఆందోళన



శిథిల వంతెన వద్ద నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకుడు కన్నబాబు, తదితరులు

దేవరాపల్లి: దేవరాపల్లి–కొత్తవలస మార్గంలో కృష్ణా**రాయుడుపేట** వద్ద శిథిలమైన కల్వర్టును **పునర్నిర్మించి** బస్సు సర్వీస్‌లను పునరుద్ధరించా**లని సీపీఎం మం**డల కార్యదర్శి వేమల కన్నబాబు **డిమాండ్ చేశారు**. ఈ మేరకు సీపీఐ ఆధ్వర్యంలో కృ**ష్ణారాయుడుపేట** సమీపంలోని శిథిల కల్వర్టు వద్ద నిరసన కార్యక్రమం శుక్రవారం చేపట్టారు. తక్షణమే కల్వర్టు నిర్మించాలని, ఆర్టీసీ బస్ సర్వీస్‌లను పునరుద్ధరించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ కృష్ణారాయుడుపేట వద్ద కల్వర్టు శిథిలమై కూలేందుకు సిద్ధంగా ఉండటంతో విశాఖపట్నం నుంచి వయా కొత్తవలస మీదుగా దేవరాపల్లి రాకపోకలు సాగించే 12డీ, 68డీ బస్సు సర్వీస్‌లను కృష్ణారాయుడుపేట వద్ద నిలిపి వేశారన్నారు. దీంతో ఉద్యోగులు, విద్యార్థులు, ప్రయాణికులు 12 కి.మీ మేర ఆటోల్లో వెళ్లాల్సి వస్తోందన్నారు. ఆర్‌అండ్‌బీ, జీవీఎంసీ అధికారులు సమన్వయంతో పని చేసి తక్షణమే కల్వర్టు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత విద్యార్థి సమైక్య ఫెడరేషన్ కె.కోటపాడు మండల అధ్యక్షుడు గొంప చైతన్య, కె.రాంబాబు, నవీన్, సాయి, నాగేంద్ర, పలువురు ఉద్యోగులు, ప్రయాణికులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీని తనిఖీ చేసిన డిప్యూటీ డీఎంహెచ్‌వో



ఆస్పత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ వీరజ్యోతి

నర్సీపట్నం: నర్సీపట్నం మండలం, వేములపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ వీరజ్యోతి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో జరుగుతున్న ప్రసవాలు ఆరా తీశారు. ప్రసవాల సంఖ్య పెంచాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రస్తుత సీజనల్ జ్వరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సిబ్బందికి సూచించారు. పీహెచ్‌సీ పరిధిలో ఉన్న హాస్టల్స్ విధిగా సందర్శించి వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వైద్యులు, సిబ్బందిని ఆదేశించారు. అనంతరం బాలుర వసతిగృహాన్ని సందర్శించి, అక్కడ పిల్లలతో మాట్లాడా రు. విద్యార్థులు తాగేందుకు వేడి నీటిని అందించాలని హాస్టల్ సిబ్బందికి సూచించారు. ఆమె వెంట ఎంపీహెచ్‌వో నాగేశ్వరరావు, హెల్త్ సూపర్‌వైజర్ మల్లిబాబు ఉన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్ పంపిణీ



తెనుగుపూడిలో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న హెచ్‌ఎం ప్రసాద్, ఉపాధ్యాయులు

దేవరాపల్లి: మండలంలోని తెనుగుపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ఎన్‌ఎంఎంఎస్ పోటీ పరీక్షలకు అవసరమైన స్టడీ మెటీరియల్‌ను శుక్రవారం పంపిణీ చేశారు. సిరీ ఫౌండేషన్ సభ్యులు ఎస్.బాబూరావు, ఎల్.వి.నారాయణరావు సహకారంతో స్థానిక హైస్కూల్ హెచ్‌ఎం వి.ఎస్.ఎస్.వి.ప్రసాద్, ఉపాధ్యాయుల చేతుల మీదుగా ఎన్‌ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆంగ్ల ఉపాధ్యాయుడు పెద్దాడ వెంకటరమణ, శ్రీనివాసరావు, మహేశ్వరరావు, మాధవరావు, త్రినాథ్ పాల్గొన్నారు.

బాలాజీ మృతికి సంతాపం



అంతిమ యాత్రలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్, తదితరులు

గొలుగొండ: గొలుగొండ ఎంపీటీసీ మాజీ సభ్యుడు గండెం ఈశ్వరావు కుమారుడు బాలాజీ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. అనకాపల్లి ప్రాంతంలో శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో బాలాజీ మృతి చెందడంపై గ్రామ ప్రజలు సంతాపం తెలిపారు. గొలుగొండలో బాలాజీ మృతదేహం వద్ద నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అంతిమ యాత్రలో పాల్గొన్నారు. బాలాజీ హైదరాబాద్‌లో గత నాలుగు సంవత్సరాలుగా బీటెక్ పూర్తి చేసి గ్రూప్–2 పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యాడు. ఇటీవల నాగార్జున సిమెంట్ కంపెనీలో తాత్కాలిక పద్ధతిలో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



రామారావు దంపతులను సత్కరిస్తున్న పెన్షనర్లు

మాకవరపాలెం: ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని పింఛన్‌దారుల సంఘం జిల్లా అధ్యక్షుడు వి.జగన్నాథరావు డిమాండ్ చేశారు. మండల పెన్షనర్ల సంఘ 20వ వార్షికోత్సవాన్ని శుక్రవారం తామరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు విడతల డీఏ బకాయిలను విడుదల చేయాలన్నారు. పెన్షన్‌దారులు కూడా ఓటర్లేనని, తమను ప్రభుత్వం చిన్న చూపు చూడటం మానుకోవాలన్నారు. ప్రస్తుత మండల అధ్యక్షుడు కె.రామారావు దంపతులను సభ్యులంతా ఘనంగా సత్కరించారు. అనంతరం నిర్వహించిన నూతన కార్యవర్గ ఎన్నికలో అధ్యక్షుడిగా ఎం.వెంకటరాజు, కార్యదర్శిగా రంగరాజు, సహాయ కార్యదర్శిగా శేషగిరిరావును ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

శారదా నదిలో పడి దుక్కిటెద్దు మృతి



మృతి చెందిన ఎద్దు

మాడుగుల రూరల్: మేతకు వెళ్లి శారదా నదిలో ప్రమాదవశాత్తు పడి ఓ దుక్కిటెద్దు మృతి చెందింది. వీరనారాయణంలో శుక్రవారం ఈ సంఘటన జరిగింది. గ్రామానికి చెందిన తలారి కృష్ణ తన దుక్కిటెద్దులను శారదా నది సమీపంలో మేతకు విడిచిపెట్టాడు. ఓ ఎద్దు మేత మేస్తూ నదిలోకి దిగి గుమ్మిలో పడి మృతి చెందింది. సుమారు 40 అడుగుల లోతులో ఉన్న గుమ్మిలో పడిపోవడం వల్ల ఎద్దు అక్కడికక్కడే మృతి చెందింది. ఇటీవల రైతు కృష్ణ రెండు ఎద్దులను రూ.1.40 లక్షలకు కొనుగోలు చేశారు. మృతి చెందిన ఎద్దును స్థానికులు తాడులతో ఒడ్డుకు చేర్చారు. సమాచారం అందుకున్న మాడుగుల అగ్నిమాపక కేంద్రం సిబ్బంది సంఘటన స్థలానికి వచ్చి నష్టం వివరాలు సేకరించారు. కె.జె.పురం ఇన్‌చార్జి పశువైద్యాధికారి శివకుమార్ మృతి చెందిన ఎద్దు వివరాలు సేకరించారు. మృతి చెందిన ఎద్దు ఖరీదు రూ.70,000 ఉంటుదని రైతు కృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు.

కొత్త పింఛన్ల పంపిణీ



రావికమతంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాజు

రావికమతం: మండలంలో ఎంపీడీవో కార్యాలయం వద్ద కొత్తగా మంజూరైన జీవిత భాగస్వామి పింఛన్లను ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు శుక్రవారం పంపిణీ చేశారు. వీటిని సద్వినియోగపరుచుకోవాలని లబ్ధిదారులకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ అధ్యక్షుడు శంకరరావు, సర్పంచ్ గెంజి మంగ మోదినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలతో పొదుపు చేయించాలి

మాడుగుల: గ్రామీణ ప్రాంతాల్లో మహిళలతో పొదుపు చేయించి, ఆర్థికంగా స్థిరపడడానికి తోడ్పాడు అందించాలని మానస మహాలక్ష్మి పొదుపు సంఘం సీఈవో పరమేశ్వరరావు అన్నారు. శుక్రవారం మాడుగులలో సంఘం అధ్యక్షురాలు పడాల అమ్మాజీ అధ్యక్షతన జరిగిన సంఘం 25వ వార్షికోత్సవంలో ఆయన మాట్లాడారు. సంఘం ద్వారా గ్రామీణ మహిళల్లో సామాజిక, ఆర్థిక విషయాలలో చైతన్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం డైరెక్టర్లు మాధవి, సత్యవతి, భవాని, సంతోషి, సంఘం సిబ్బంది పద్మ, మౌనిక, దేవి, నాగమణి, సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా సియోను ప్రార్థన మందిరం వార్షికోత్సవం



మందిరంలో కేక్ కట్ చేస్తున్న రెవ. ఫిలోమోన్, డా. టైటస్ గ్రేస్ దంపతులు

దేవరాపల్లి: మండలంలోని కాశీపురం సియోను ప్రార్థన మందిరం 47వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా రెవ. ఫిలోమోన్‌తో కలిసి డా. టైటస్ కేక్ కట్ చేశారు. అనంతరం టైటస్ వార్షికోత్సవ సందేశాన్ని వినిపించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్స్ పీటర్, జైరాజు, లాజరస్, సియోను ప్రార్థన మందిరం పెద్దలు, యువకులు కలిసి అనాథ పిల్లలకు దుస్తులు, ఆహారం అందజేశారు.

తల్లి పాలే బిడ్డకు ప్రథమ టీకా



కె.జె.పురం అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలు, గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది



కె.కోటపాడు ఆసుపత్రిలో బాలింతలకు తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న పీవో లలితకుమారి.



కొత్తకోటలో ర్యాలీ నిర్వహిస్తున్న సీడీపీవో మంగతాయారు, తదితరులు



నర్సీపట్నంలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు, వైద్య సిబ్బంది

కె.కోటపాడు : పుట్టిన బిడ్డకు వెంటనే తల్లిపాలను అందించాలని కె.కోటపాడు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి లలితకుమారి సూచించారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలకు కె.కోటపాడు ఆస్పత్రిలో శుక్రవారం ఆమె అవగాహన కల్పించారు. తల్లిపాలలో అధిక ఔషధ గుణాలు ఉండడం వల్ల రోగ నిరోధక శక్తి వస్తుందన్నారు. ఆరు నెలల వరకూ బిడ్డకు తల్లిపాలను పట్టాలన్నారు.

రావికమతం: పుట్టిన వెంటనే బిడ్డకు తల్లి పాలు ఇవ్వాలని సీడీపీవో మంగతాయారు అన్నారు. రావికమతం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో కొత్తకోట సెక్టార్‌లో అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాలు వారోత్సవాలు నిర్వహించారు. సర్పంచ్ లోవరాజు, వైస్ సర్పంచ్ పందల దేవా, మాజీ సర్పంచ్ కోట నీలవేణి, ఈవో ఈశ్వరరెడ్డి, సెక్టార్ సూపర్‌వైజర్ ఉన్నిషా, అంగన్‌వాడీ కార్యకర్తలు, బాలింతులు, గర్భిణులు పాల్గొన్నారు.

మాడుగుల రూరల్: తల్లిపాలే బిడ్డకు ప్రథమ టీకా అని కె.జె.పురం 1వ అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్త పి.చంద్ర అన్నారు. ప్రపంచ తల్లి పాలు వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లి పాలు వల్ల తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు.

నర్సీపట్నం: బిడ్డకు విధిగా తల్లిపాలు తాగించాలని సీడీపీవో జి.వి.రమణి పేర్కొన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు వెంటనే ముర్రుపాలు ఇవ్వాలన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

నాతవరం మండల సర్వేయరుగా సత్యనారాయణ



నాతవరం: మండల సర్వేయరుగా వి.సత్యనారాయణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన సర్వేయరు ప్రసాద్ చోడవరం మండలానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో గొలుగొండ మండలంలో పని చేస్తున్న సత్యనారాయణ ఇక్కడికొచ్చారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతులకు సంబంధించి భూసర్వే దరఖాస్తులు సకాలంలో పూర్తి చేసేందుకు దృష్టి సారిస్తానన్నారు.

క్వారీ అనుమతులు రద్దు చేయాలి

మాకవరపాలెం: మండలంలోని జి.కోడూరు రాళ్ల క్వారీ అనుమతులు రద్దు చేయాలని విదసం రాష్ట్ర అధ్యక్షుడు బూసి వెంకటరమణ డిమాండ్ చేశారు. ఈ క్వారీని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్వారీని ఆనుకుని ఉన్న భూములను నమ్ముకుని జి.కోడూరుకు చెందిన దళిత రైతులు జీవనం సాగిస్తున్నారన్నారు. దీని నిర్వహణ కారణంగా ప్రభుత్వానికి, లీజుదారులకు ఆదాయం వచ్చినా ఇక్కడి పంటలు నాశనం అవుతున్నాయన్నారు. అధికారులు స్పందించి క్వారీ అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.

వాసవీ కన్యకాపరమేశ్వరికి పుష్పార్చన



10వేల గులాబి పువ్వులతో కన్యకా పరమేశ్వరి అమ్మవారి పుష్పార్చనలో పాల్గొన్న భక్తులు



కె.కోటపాడులో గౌరీపరమేశ్వరులకు కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

కె.కోటపాడు : కె.కోటపాడులోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారికి 10 వేల గులాబీ పువ్వులతో శుక్రవారం అర్చన చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శ్రావణ మాసం రెండో శుక్రవారం కావడంతో గులాబి పువ్వులతో అర్చకులు గోరుగుంత రమేష్‌బాబు ఈ పుష్పార్చన కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. ఆలయ కమిటీ చైర్మన్ కోట్ల రాంబాబు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అలాగే కె.కోటపాడులోని గౌరీ పరమేశ్వరుల ఆలయంలో కుంకుమ పూజలు చేశారు.

282 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు



కంటి పరీక్ష చేయించుకుంటున్న విద్యార్థులు

బుచ్చెయ్యపేట: మండలంలోని దిబ్బిడి జిల్లా పరిషత్ హైస్కూల్లో 282 మంది విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు చేశారు. శుక్రవారం జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో పాఠశాలలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి కె.శ్రీనివాసరావు తమ సిబ్బందితో విద్యార్థులకు కంటి పరీక్షలు చేశారు. వీరిలో ఏడుగురికి దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించారు. వారికి త్వరలో కళ్లద్దాలు అందిస్తామని నిర్వాహకులు తెలిపారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

దేవరాపల్లి: బోయిలకింతాడ సబ్‌స్టేషన్ పరిధిలోని ఎం.అలమండ ఫీడర్‌లో ములకలాపల్లి, కొత్తపెంట, ఎస్.జి.నగరం గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు స్థానిక ఎలక్ట్రికల్ ఏఈఈ కె.శంకరరావు తెలిపారు. ఈ మూడు గ్రామాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. 24 గంటల విద్యుత్ లైన్‌కు సంబంధించిన పనులు చేపడుతున్నామని, ఈ విషయన్ని గమనించి ప్రజలు తమకు సహకరించాలని కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



రొంగలినాయుడుపాలెంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి మాదంనాయుడు

కె.కోటపాడు : సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి మాదంనాయుడు అన్నారు. రొంగలినాయుడుపాలెం గ్రామంలో శుక్రవారం సంచార వైద్య చికిత్స కార్యక్రమం నిర్వహించారు. 122 మందికి వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. గర్భిణులకు ఆరోగ్య పరీక్షలతో పాటు జాగ్రత్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ సంతోషి, ఏఎన్‌ఎం ఇంద్ర, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.